

రక్తదానం ప్రాణదానంతో సమానం

ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్

ప్రజాశక్తి - చింతలపూడి

అన్ని దానాల్లోకెల్లా రక్తదానం ఎంతో గొప్పదని, ప్రతిఒక్కరూ రక్తదానం చేయడం వల్ల ఆపద సమయంలో ఉన్నవారికి ప్రాణదానం చేసినవారవుతారని, ప్రతిఒక్కరూ రక్తదానాన్ని ప్రోత్సహించాలని ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ తెలిపారు. పట్టణంలో శుక్రవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ గురువారం ప్రారంభించారు. ఈ శిబిరంలో రక్తదానం చేసినవారిని ఎస్‌పి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ తలసేమియా వ్యాధిగ్రస్తులకు దాతలు ఇచ్చే రక్తమే వారి ప్రాణాలను కాపాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం డిఎస్‌పి రవిచంద్ర, చింతలపూడి సిఐ రాజశేఖర్, ఎస్ఐ కుటుంబరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతులకు..

'పెట్టుబడిసాయం' ఇచ్చేనా..!

ఈనెలఖారుకు 'అన్నదాత సుఖీభవ' సొమ్ములు జమచేస్తామని ప్రభుత్వం ప్రకటన

కౌలు రైతులకు సాయంపై విధి విధానాలు విడుదల చేయని పరిస్థితి

భూ యజమానులకు సంబంధించి మాత్రమే జాబితాకు ఆదేశాలు

ఒకే సర్వే నంబర్‌పై భూ యజమానికిస్తే.. కౌలురైతు పరిస్థితి ఏమిటి.?

కౌలురైతులకు భూయజమాని అంగీకారం పత్రం నిబంధనపై వీడని సందిగ్ధత

వాస్తవ సాగుదారులను విస్మరిస్తే ప్రభుత్వంపై వ్యతిరేకత తప్పదు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వం 'అన్నదాత సుఖీభవ' పథకం కింద అందించే పెట్టుబడి సాయం ఈ నెలఖారుకు అందిస్తామని ప్రకటించింది. కేంద్రం ఇచ్చే రూ.ఆరు వేలు కాకుండా మిగిలిన రూ.14 వేలు కేంద్రం సాయంతోపాటు ఇస్తామని తెలిపింది. దీంతో కౌలురైతులకు పెట్టుబడి సాయం అందేనా అన్న చర్చ రైతుల్లో కొనసాగుతోంది. భూ యజమానుల అర్హత జాబితాను వెబ్‌ల్యాండ్ ఆధారంగా రూపొందిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అర్హుల జాబితాను ఈ నెల 20వ తేదీకి పూర్తిచేయాలని అధికారులకు ఆదేశాలు అందాయి. కౌలురైతుల అర్హుల జాబితా రూపకల్పనపై మాత్రం అధికారులకు ఎటువంటి ఆదేశాలూ విడుదల కాలేదు. భూ యజమానులతో పాటు ఈనెలఖారుకు కౌలురైతులకు అన్నదాత సుఖీభవ సొమ్ములు ఇస్తారా.. లేదా అనేది తెలియని పరిస్థితి నెలకొంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు మూడు లక్షల మంది కౌలు రైతులు ఉన్నారు. 2014-19 టిడిపి పాలనలో కౌలు రైతులకు సంబంధించి అధికారులు తేల్చిన లెక్క ఇది. రెండు జిల్లాల వ్యవసాయ సాగులో 75 శాతం కౌలురైతులే సాగుచేస్తున్నారు. నిబంధనల ప్రకారం పెట్టుబడిసాయం అనేది సాగుచేసే రైతులకు అందించాలి. ప్రభుత్వాలు మాత్రం పెట్టుబడి పెట్టి సాగుచేసే కౌలురైతులకు కాకుండా భూ యజమానులకు అందిస్తోంది. దీంతో ప్రకృతి వైపరీత్యాలకు పంటలు దెబ్బతింటే ప్రభుత్వం అందించే పంటసాయం, బీమా వంటివి సైతం భూయజమానుల జేబుల్లోకే వెళ్లిపోతున్నాయి. దీంతో ఏటా జిల్లాలో కౌలురైతుల ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రస్తుత డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ ఆత్మహత్యలు చేసుకున్న కౌలురైతుల కుటుంబాలను పరామర్శించి ఆర్థికసాయం సైతం అందించారు. తాము అధికారంలోకి వస్తే కౌలురైతులను పూర్తిగా ఆదుకుంటామంటూ గడిచిన ఎన్నికల్లో కూటమి నేతలు ఊదరగొట్టారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి కౌలురైతుల అర్హుల ఎంపికకు ఎటువంటి విధివిధానాలు ఖరారు చేయకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం పిఎం కిసాన్ పథకం కింద అందించే పెట్టుబడి సాయం ఏలూరు జిల్లాలో లక్షా 32 వేల మంది అందుకుంటున్నారు. పశ్చిమలోనూ అదే సంఖ్యలో రైతులు ఉన్నారు. పిఎం కిసాన్ సాయం కేంద్రం భూ యజమానులకు మాత్రమే అందిస్తోంది. కౌలు రైతులకు చిల్లిగవ్వ కూడా ఇవ్వడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అన్నదాత సుఖీభవ కింద ఇచ్చే రూ.20 వేలు కౌలు రైతులకు సైతం అందిస్తామని చెప్పింది. కార్యాచరణ మాత్రం అందుకు విరుద్ధంగా కొనసాగుతోంది.

కౌలుకార్డులు అందరికీ ఇస్తారా?

గత వైసిపి ప్రభుత్వం కౌలు కార్డులు జారీలో ఆంక్షలు విధించింది. సాగుచేస్తున్న కౌలు రైతులందరికీ ఇవ్వకుండా జిల్లాకు ఇన్ని కార్డులు జారీ చేయాలని టార్గెట్ పెట్టింది. కూటమి ప్రభుత్వం సైతం అదేదారిలో నడుస్తోంది. ఈ ఏడాది ఏలూరు జిల్లాలో 75 వేల మందికి కౌలు కార్డులు ఇవ్వాలని టార్గెట్ పెట్టారు. పశ్చిమలోనూ లక్షా మందికిపైగా కౌలురైతులకు కౌలు కార్డులు ఇవ్వాలని టార్గెట్ తీసుకున్నట్లు చెబుతున్నారు. వ్యవసాయ సాగుచేసిన కౌలు రైతులందరికీ కౌలు కార్డులు జారీచేయకుండా టార్గెట్‌లు పెట్టడం ఏంటో అర్థం కావడం లేదు. దీంతో చాలా మంది రైతులకు కౌలుకార్డులు అందని పరిస్థితి ఏర్పడనుంది. కౌలుకార్డులు ఆధారంగా అన్నదాత సుఖీభవ అందిస్తారని అధికారులు చెబుతున్నారు. సాగుచేసే కౌలు రైతులందరికీ కార్డులు ఇవ్వకపోతే కౌలు రైతులకు న్యాయం ఏవిధంగా జరుగుతుందో ప్రభుత్వం చెప్పాల్సి ఉంది. అంతేకాకుండా కౌలుకార్డు జారీకి భూయజమాని అంగీకార పత్రం ఉండాలంటూ గత వైసిపి ప్రభుత్వం నిబంధనలు విధించింది. చట్టంలో మార్పులు చేస్తామని కూటమి ప్రభుత్వం చెప్పింది. ఏడాది గడిచినా ఇప్పటికీ చట్టం చేయలేదు. కౌలుకార్డు జారీకి భూయజమాని అంగీకార పత్రం ఉండాలా.. లేదా అన్నదానిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సి ఉంది. అదేవిధంగా ఒక సర్వే నంబర్‌పై భూయజమానికి, కౌలురైతుకు పెట్టుబడిసాయం అందిస్తారా లేదా అనేది సైతం ప్రభుత్వం చెపాల్సి ఉంది. ఇవన్నీ తేలాలంటే కౌలురైతులకు అన్నదాత సుఖీభవ అందించే విధివిధానాలు విడుదల చేయాలి.



మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారధి

జూన్ నెలాఖరులోగా గృహ నిర్మాణాలు పూర్తిచేయాలి

రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు నియోజక వర్గంలో పేదలకు నిర్మిస్తున్న గృహ నిర్మాణాలను జూన్ నెలాఖరులోగా పూర్తిచేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి అధికారులను ఆదేశించారు. నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గంలోని ఇళ్ల నిర్మాణ ప్రగతిపై హౌసింగ్, డ్వామా, ఆర్‌డబ్ల్యుఎస్, డిఆర్‌డిఎ, ఎపి ఇపిడిసిఎల్, సర్వే, మెప్మా, ఆర్‌అండ్‌బి, పంచాయతీ రాజ్, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, అధికారులతో మంత్రి పార్థసారధి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేదవాడికీ సొంతిల్లు మంజూరు చేస్తామన్నారు. వేసవి కాలం నిర్మాణ పనులకు అనుకూలమైందన్నారు. పేదలకు స్థలం మంజూరు చేసి, నిర్మాణ పనులు ప్రారంభించి జూన్ నెలాఖరు నాటికి పూర్తిచేసి గృహ ప్రవేశాలు చేసుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వ సమయంలో గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ఇళ్ల కోసం 2 సెంట్ల భూమి మంజూరు చేసి, ఇంకా ఆ భూమిని లబ్ధిదారులకు స్వాధీనం చేయని వారికి కొత్త నిబంధనల ప్రకారం 3 సెంట్ల భూమిని మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఇసుక, సబ్సిడీపై సిమెంట్, నిర్మాణ సామగ్రి గురించి లబ్ధిదారులకు తెలియజేసి, నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేలా ప్రోత్సహించాలన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలతో పాటు నూజివీడు పట్టణంలో నిర్మించే గృహ నిర్మాణాల ప్రగతిపై ఒక్కొక్కటిగా అధికారులతో మంత్రి సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. టిడిపి నాయకులు గృహ నిర్మాణంపై పలు సమస్యలు మంత్రి దృష్టికి తీసుకురాగా తక్షణం వాటి పరిష్కార మార్గం చూడాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో గతంలో తాము ఇచ్చిన ఇళ్ల నిర్మాణ స్కీం టార్గెట్ ఎందుకు పూర్తి చేయలేక పోయారని నిలదీశారు. నిర్దేశిత సమయానికి ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేయకపోతే తగు చర్యలు తప్పవని హెచ్చరించారు. నియోజక వర్గంలో ఎన్ని ఇళ్లు నిర్మించారు, ఇంకా ఎన్ని నిర్మించాల్సి ఉంది వంటి సమగ్ర వివారాలు అందించాలన్నారు. జిల్లా గృహ నిర్మాణ ప్రాజెక్ట్ డైరెక్టర్, అసిస్టెంట్ ఇంజినీర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, అందరూ కలిసి సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రధానిమంత్రి ఆవాస్ యోజన పథకంలో నిర్మించే గృహ నిర్మాణాలు నిర్ణీత సమయంలో పూర్తిచేయాలన్నారు. విధి నిర్వహణలో అలసత్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. సమావేశంలో నూజివీడు సబ్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్, హౌసింగ్ అర్బన్ ఎస్ఇ ఎం.కృష్ణయ్య, గృహనిర్మాణ ప్రాజెక్టు డైరెక్టర్ జివివి.సత్యనారాయణ, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ సత్య నారాయణ, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, అసిస్టెంట్ ఇంజినీర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, అధికారులు పాల్గొన్నారు.

నిఘా వ్యవస్థను పటిష్టం చేయాలి

చింతలపూడి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్

ప్రజాశక్తి - చింతలపూడి

మండల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా నిఘా వ్యవస్థను పటిష్టం చేయాలని ఏలూరు జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ ఆదేశించారు. శుక్రవారం చింతలపూడి పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా పరిశీలించారు. ఈ సందర్భంగా చింతలపూడి పోలీస్ సిబ్బంది జిల్లా ఎస్‌పికి గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు 'స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర' కార్యక్రమాలను అమలు చేయాలన్నారు. స్టేషన్‌లో నిర్వహిస్తున్న అన్ని రికార్డులనూ సమీక్షించి, పరిపాలనా విధానాలను మెరుగుపర్చేలా మార్గదర్శకాలు ఇచ్చారు. మండల పరిధిలోని ప్రతి గ్రామ సమస్యనూ అధికారుల ద్వారా వివరంగా అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో చిన్న సమస్యలు తలెత్తిన వెంటనే అధికారులు వాటి పరిష్కారానికి ముందడుగు వేస్తే, భవిష్యత్తులో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఉంటుందన్నారు. డ్రోన్ కెమెరాల పర్యవేక్షణ ద్వారా నేరాలను గుర్తించి, ట్రాఫిక్ సమస్యలపై తక్షణం చర్యలు తీసుకోవాలని తెలిపారు. హైస్కూల్, కాలేజీలు, రద్దీ ప్రదేశాలలో 'శక్తి యాప్'పై ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మహిళలు, బాలికలు ఈ యాప్ ఉపయోగించడం ద్వారా సురక్షితంగా ఉండేలా వారిలో విశ్వాసం పెంపొందించాలన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో వచ్చిన సమస్యలపై తక్షణం చర్యలు తీసుకొని, బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని, అధికారులు సమిష్టిగా పనిచేస్తూ రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. డ్రోన్ పర్యవేక్షణ ద్వారా ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆపరేషన్ సింధూర్‌ను పురస్కరించుకుని ఎటువంటి అసత్య ప్రచారాలు చేయకుండా చూడాలన్నారు. కొత్త వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచాలని, వాట్సప్ ద్వారా జరిగే ప్రచారాలపై ఏదైనా అనుమానాస్పద ప్రచారాలు జరిగితే వాటిపై వాటి అడ్మిన్లపై కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏదైనా విపత్కర పరిస్థితి ఎదురైన సమయంలో ప్రజలు వారి ప్రాణాన్ని ఎలా సంరక్షించుకోవాలనే విషయాలపై మాక్ డ్రిల్ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం డిఎస్‌పి రవిచంద్ర, చింతలపూడి ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, చింతలపూడి ఎస్ఐ కుటుంబరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్

12న ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విద్యాశాఖలో సమస్యలపై ఈనెల 12వ తేదీన ఏలూరు డిఇఒ కార్యాలయం ఎదుట యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రుద్రాక్షి రవికుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటలక్ష్మమ్మకు ఆమె కార్యాలయంలో యుటిఎఫ్ ఏలూరు జిల్లా శాఖ తరపున ముందస్తు నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఈ నిరసన కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పాఠశాల విద్యాశాఖ చేపడుతున్న పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ, ఏ విధమైన స్పష్టమైన జిఒలు లేకుండానే రోజుకో ఆలోచనతో జరుగుతున్న ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ అందరిలో తీవ్ర ఆందోళన కలిగిస్తోందని, వారం వారం గుర్తింపు ఉపాధ్యాయ సంఘాలతో నిర్వహిస్తున్న సమావేశాల్లో సమస్యలు ప్రభుత్వం దృష్టికి తెస్తున్నప్పటికీ అవి పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉపాధ్యాయుల ఆందోళన గమనించి సమస్యలు సత్వరమే పరిష్కరించాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కూడా నోటీసు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిని, జిల్లా కోశాధికారి జివి రంగమోహన్, జిల్లా కార్యదర్శి నంబూరి రాంబాబు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ బి.మోహన్‌రావు, జిల్లా మీడియా కన్వీనర్ ఎండి జక్రియ పాల్గొన్నారు.



డిఇఒకు నోటీసు అందజేస్తున్న నేతలు

గండ్లు పూడ్చి, రోడ్లను నాణ్యంగా నిర్మించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు

గతేడాది వరద ప్రభావిత ప్రాంతాల పరిశీలన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ప్రాంతంలో వరదలు వచ్చి తొమ్మిది నెలలు గడిచినా నేటికీ గండ్లు పూడ్చలేదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు అన్నారు. నూజివీడులో వరద ప్రభావానికి గురైన పలు ప్రాంతాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెదచెరువు, మరికొన్ని గండ్లు పూడ్చకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ప్రభుత్వం సుమారు రూ.కోటి విడుదల చేసినా అధికారుల అలసత్వం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో సామాన్య ప్రజానీకం, రైతాంగం తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా స్పందించి సకాలంలో గండ్లు పూడ్చాలని కోరారు. గండ్లు పూడ్చకపోవడంతో ఇటీవల కురిసిన చిన్నపాటి జల్లులకు సైతం వరద మాదిరిగా రోడ్లపై నీళ్లు ప్రవహించాయన్నారు. చెరువుల్లో నిల్వ ఉండాల్సిన నీరు రోడ్ల పాలు కావడంతో ప్రస్తుతం పండే పంటలు తీవ్ర నష్టాలకు గురవుతున్నాయన్నారు. అదే నీటిని నిల్వ ఉంచగలిగితే భూగర్భ జలాలు అభివృద్ధి సాధించడంతోపాటు, సకాలంలో అందరికీ జల వనరులు అందుతాయన్నారు.



గండి పడిన ప్రదేశాన్ని చూపుతున్న సిపిఎం నేత రాజు

మూడు నాళ్ల ముచ్చటగా రోడ్లు

నూజివీడు పట్టణ పరిధిలోని తిరువూరు రోడ్డు, మండలంలోని కొన్నం గుంట పరిసర ప్రాంతాల్లో నిర్మించిన రోడ్లు మూడు నాలుగు ముచ్చటగా మారాయన్నారు. రోడ్లను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ నాసిరకంగా రోడ్లను నిర్మించిన కాంట్రాక్టర్లపై తగిన చర్యలు చేపట్టాలన్నారు. నాణ్యత లోపించిన రోడ్లను తొలగించి వాటి స్థానంలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ రోడ్లను నిర్మించాలని డిమాండ్ చేశారు. రోడ్లకు మార్జిన్‌లో మట్టిని కూడా పోయలేదని చెప్పారు. ఈ మేరకు సిపిఎం తరపున రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేశామని తెలిపారు.

వసతి గృహాల్లో పిల్లలను సొంత బిడ్డల్లా చూడాలి

ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్న ప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వసతి గృహాల్లోని పిల్లలను సొంత బిడ్డల్లా చూసుకుని భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ అన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ శుక్రవారం శనివారపేటలోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. వండిన ఆహార పదార్థాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ పిల్లల సంరక్షణ, వైద్యం, విద్య, శిక్షణాభివృద్ధి, పునరావాసం కోసం ఈ వసతి గృహాన్ని ఏర్పాటు చేశారని, ప్రతి నెలా హాస్టల్‌ను సందర్శించి బాలలకు అందుతున్న సేవలు, సౌకర్యాలపై విచారించాల్సి ఉందని తెలిపారు. అందులో భాగంగానే వసతి గృహాన్ని సందర్శించడం జరిగిందని, అలాగే అబ్జర్వేషన్ హోమ్‌లో ఉన్న బాలలకు, చట్టంతో విభేదించిన బాలలకు అందుబాటులో ఉన్న న్యాయసహాయంపై, వసతులపై అడిగి తెలుసుకున్నారు. అలాగే బెయిల్ గ్రాంటు అయి పూచీ కత్తు పెట్టుకోలేని బాలలకు ప్రత్యామ్నాయ మార్గాలపై చర్చించాల్సి ఉందని తెలియజేశారు. అలాగే వసతి గృహంలో బాలురకు వేసవి సెలవులలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి సాంకేతిక విద్యను బోధించాలని వసతి గృహ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వసతి గహ అధికారి,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



వంటకాలను పరిశీలిస్తున్న రత్నప్రసాద్

2.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

రూ.398.52 కోట్లు రైతుల ఖాతాల్లో జమ

జిల్లా పౌర సరఫరాల మేనేజర్ పిఎస్‌ఆర్.మూర్తి

ప్రజాశక్తి - ఏలూరు

రైతులు పండించిన ధాన్యాన్ని దళారుల ప్రమేయం లేకుండా రైతు సేవాకేంద్రాల ద్వారా సంబంధిత సిబ్బంది ట్రక్ షీట్‌లో నమోదు చేసి రైస్ మిల్లులకు తరలిస్తున్నారని జిల్లా పౌర సరఫరాల మేనేజర్ పిఎస్‌ఆర్.మూర్తి తెలిపారు. జిల్లాలో ఉన్న రైతులు వారి సమీపంలోని రైతు సేవాకేంద్రాల ద్వారా వారు పండించిన ధాన్యాన్ని అమ్ముకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వం వారు నిర్ణయించిన ఇ-పంటలో నమోదైన రైతుల ధాన్యాన్ని విక్రయించడానికి వీలు పడుతుందన్నారు. జిల్లాలో ఉన్న అన్ని రైతు సేవాకేంద్రాల ద్వారా ఇప్పటివరకు 57,50,574 గోనెసంచులను రైతులకు సరఫరా చేసి రూ.501.81 కోట్ల విలువైన 2.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 17,512 మంది రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి ఇప్పటివరకు రూ.398.52 కోట్లు రైతుల ఖాతాలకు జమ చేసినట్లు తెలిపారు. రైతు సంఘాలు, రైతుల విజ్ఞప్తుల మేరకు జిల్లాకు 2.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని సమీపంలో ఉన్న రైతు సేవాకేంద్రాల ద్వారా అమ్ముకోవల్సిందిగా ఆయన కోరారు. అకాల వర్షాల వల్ల రైతులెవ్వరూ అధైర్యపడవద్దన్నారు. రైతుల ధాన్యాన్ని ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలు అనుసరించి కొనుగోలు చేస్తామని తెలిపారు.

కట్టుదిట్టంగా పీజీ సెమిస్టర్ పరీక్షలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని కృష్ణా యూనివర్సిటీ పరిధిలోని డాక్టర్ ఎంఆర్.అప్పారావు పీజీ సెంటర్‌లో శుక్రవారం యూనివర్సిటీ పీజీ పరీక్షలు నిర్వహించారు. ఉదయం ఫోర్త్ సెమిస్టర్, మధ్యాహ్నం సెకండ్ సెమిస్టర్ ఎం కామ్, ఎంబిఎ, ఎంఎస్‌సి పరీక్షలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నవీన లావణ్యలత పరీక్షలను పర్యవేక్షించి పరిశీలించారు. పరీక్షలను కట్టుదిట్టమైన భద్రత మధ్య నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇప్పించాలి

కాలేజీ యాజమాన్యంపై సుమోటోగా కేసు నమోదు చేయాలి

విద్యాశాఖాధికారులను కోరిన ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ జిల్లా కమిటీలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

నోవా కాలేజీ విద్యార్థులకు సర్టిఫికెట్ ఇవ్వని యాజమాన్యంపై సుమోటోగా కేసు నమోదు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ జిల్లా కమిటీలు డిమాండ్ చేశాయి. పట్టణంలోని సుందరయ్య ప్రజాసంఘాల కార్యాలయంలో ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ అధ్యక్షత వహించగా డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సూర్యకిరణ్ మాట్లాడారు. ఇటీవల జంగారెడ్డిగూడెం మండలం వేగవరం గ్రామ పరిధిలో ఉన్న నోవా కాలేజీ విద్యార్థులు డిఎస్‌సి, సంబంధిత దరఖాస్తుల కోసం సర్టిఫికెట్లను అడగగా నోవా కాలేజీ యాజమాన్యం ఇష్టానుసారంగా ప్రవర్తించారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తామని వాగ్దానం ఇచ్చారని విద్యార్థులు చెబుతున్నారన్నారు. అలాగే అసలు తమ సర్టిఫికెట్లు యాజమాన్యం దగ్గర ఉన్నాయా లేదా అంటూ విద్యార్థులు చింతిస్తున్నారన్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇప్పించాలని, విద్యార్థుల పట్ల నిరంకుశత్వంగా వ్యవహరించిన నోవా కాలేజీ యాజమాన్యంపై ప్రభుత్వం సుమోటోగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు

జంగారెడ్డిగూడెం పట్టణంలో ఉన్న విద్యాసంస్థలు కొంతమంది విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇచ్చేందుకు ఇబ్బందులు పెడుతున్నాయని, వాటిపై సంబంధిత విద్యాశాఖాధికారులు స్పందించి చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్న అటువంటి విద్యాసంస్థల పర్మిషన్స్ రద్దు చేయాలని కోరారు. జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజనల్ అధికారి ఆర్‌డిఒ, జిల్లా కలెక్టర్ స్పందించి విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యేలా వ్యవహరించే కాలేజీ యాజన్యాలపై కఠిన చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు యశ్వంత్, పి.పోతురాజు, తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సూర్యకిరణ్

చేబ్రోలు ఇసుక స్టాక్ పాయింట్ పరిశీలన

ప్రజాశక్తి - ఉంగుటూరు

చేబ్రోలు ఇసుక స్టాక్ పాయింట్‌ను జాయింట్ యాక్షన్ కమిటీ శుక్రవారం పరిశీలించింది. జెఎసిలో ఉంగుటూరు తహశీల్దార్ పాలపర్తి రవికుమార్, అసిస్టెంట్ జియాలజిస్ట్ ధనుంజయ్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ విఠల్ ఉన్నారు. చేబ్రోలు సర్వే నెంబర్ 38లో 12.48 ఎకరాల భూమిలో కొంత భూమిలో గత ప్రభుత్వం నుంచి ఇసుక డంపింగ్ యార్డ్‌గా వినియోగిస్తున్నారు. తాళ్లపూడి నుంచి లారీలపై ఇసుక తీసుకొచ్చి చేబ్రోలులో స్టాక్ పెట్టి ప్రజలకు సరఫరా చేసేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా భూమి హద్దులు, రహదారులు జియో ట్యాగింగ్ తదితర అంశాలను నిర్ధారణ చేసేందుకు జెఎసిని కలెక్టర్ నియమించినట్లు ఉంగుటూరు తహశీల్దార్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం స్థలాన్ని పరిశీలించేందుకు వచ్చినట్లు అధికారులు చెప్పారు. విఆర్ఒ ఎన్.ఏడుకొండలు పాల్గొన్నారు.



స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న జాయింట్ యాక్షన్ కమిటీ

పాడి, పంటలతోనే దేశాభివృద్ధి

రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పాడి, పంటల అభివృద్ధితోనే దేశం అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి అన్నారు. మండలంలోని యనమదల గ్రామంలో శుక్రవారం నిర్వహించిన 50 శాతం రాయితీపై పశువుల దాణా, వ్యవసాయ పనిముట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు దాణా, పనిముట్లను అందించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ద్వారా 50 శాతం రాయితీపై అందించే దాణా, పచ్చి రొట్ట విత్తనాలు, పిల్లిపెసర, జనుము, జీలుగ విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు (ట్రాక్టర్లు, రోటవేటర్లు, పవర్ స్ప్రేయర్లు) రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నూజివీడు నియోజకవర్గంలో సుమారు 2425 క్వింటాలు పచ్చి రొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. మామిడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వంతో మాట్లాడి అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సన్న, చిన్నకారు రైతులకు ప్రోత్సాహకరమైన రుణాలు అందిస్తుందన్నారు. గొర్రెలు, మేకలు, పశువుల, మూగ జీవుల ఫామ్స్ నిర్మాణానికి రూ.కోటి వరకు రుణం 50 శాతం రాయితీతో ప్రభుత్వం అందిస్తుందన్నారు. బ్యాంకర్లు అందించే రుణాలపై అవగహన కల్పించేందుకు, రుణాలు పొందేందుకు త్వరలో ఒక అధికారిని నియమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక అధికారులు, టిడిపి కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



రాయితీ పరికరాలు అందిస్తున్న మంత్రి

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఎపి ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు

ప్రజాశక్తి - పోలవరం

నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఎపి ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు అన్నారు. పోలవరంలోని ఆయన నివాసం వద్ద శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రోడ్లు, తాగునీరు, పునరావాస కాలనీల మౌలిక వసతులు సదుపాయాల కల్పనపై ప్రజల నుంచి వినతిపత్రాలు అందాయని, ఈ సమస్యలను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిల దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు అనపర్తి వెంకటనారాయణ, పార్టీ మండలాధ్యక్షులు బొడ్డు కృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి నునకాని రాంబాబు, మాజీ ఉప సర్పంచి మంగిన కొండ, పసుమర్తి భీమేశ్వరరావు, పోతుల శ్రీను, దూసనపూడి పోశిబాబు, సత్యనారాయణ, నారాయణరావు, యడ్ల వినోద్, మానికల శ్రీను, బన్ను పాల్గొన్నారు.

20న దేశవ్యాప్త సమ్మె జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - టి.నర్సాపురం

ఈ నెల 20న జరుగుతున్న దేశవ్యాప్త జాతీయ కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గూడెల్లి వెంకట్రావు పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీ ఎపిఒ కార్యాలయంలో 20వ తేదీన ఒకరోజు సమ్మెకు సహకరించి ఉపాధి కూలీలంతా సమ్మెలో పాల్గొనేలా చూడాలని ఉపాధి హామీ కార్యాలయం సిబ్బంది కట్టప్పకు సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ మండలంలోని ఉపాధి కూలీలు, అన్ని రంగాల కార్మికులు సమ్మె కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి అనుమోలు మురళి, ఐద్వా మహిళా సంఘం మండల కార్యదర్శి మడకం కుమారి, శిరీష తదితరులు ఉన్నారు.

చింతలపూడి : నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనాల కోసం, పంటకు గిట్టుబాటు ధరకు, ఉపాధి హామీ చట్టానికి నిధులు పెంచాలని కోరుతూ ఈ నెల 20వ తేదీన దేశ వ్యాప్తంగా జరిగే సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు మండలాధ్యక్షులు నత్త వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుక్లెట్‌ను శుక్రవారం అంగన్వాడీ కార్మికులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ప్రాజెక్ట్ కార్యదర్శి టి.మాణిక్యం, ఎఐటియుసి జిల్లా నాయకురాలు అంజమ్మ, బి.ఫణివర్ధిని, సరళదేవి, ఎం.అరుణ, సీతామహాలక్ష్మి, రత్నం, చెన్నకేశ్వరి, మార్తమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బిసి రిజర్వేషన్ అమలులో లోపాలు సరిచేయాలి

ఏలూరు సిటీ : బిసి రిజర్వేషన్ అమలులో జరిగే లోపాలను సరి చేయాలని, నీట్, జెఇఇ వంటి పరీక్షల్లో ఒబిసి రిజర్వేషన్లు సక్రమంగా అమలు చేయాలని కోరుతూ జిల్లా జాతీయ బిసి సంక్షేమ సంఘం నాయకులు, ఎపి బిసి ఒబిసి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్, బిసి కులాలు జెఎసి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ క్యాంపు కార్యాలయంలో జిల్లా పరిషత్ చైర్మన్ పద్మశ్రీని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి చర్చించారు. ఈ సందర్భంగా సమగ్ర జనగణలో బిసి కులగణన జరగాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి కులాల ఎబిసిడి రిజర్వేషన్ అమలు చేయాలని, బిసి భవన్ ఏర్పాటు చేయాలని, ఆంధ్రప్రదేశ్‌లోని బిసిలు ఎదుర్కొన్న వివిధ సమస్యలు, బిసి ఉద్యోగులు, బిసి విద్యార్థులు ఒబిసి సర్టిఫికెట్ పొందేందుకు ఎదుర్కొనే వివిధ సమస్యలపై చర్చించారు. అదేవిధంగా బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు, రాజకీయాల్లో బిసిలకు ఎక్కువ అవకాశాలు కల్పించాలని, ఏలూరులో ఉన్న అన్ని బిసి సంఘాలందరిని కలుపుకుని రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

దోమల మందు విధిగా పిచికారీ చేయాలి

జీలుగుమిల్లి : మండలంలోని మారుమూల ఏజెన్సీ గ్రామాల్లో దోమల మందు విధిగా పిచికారీ చేయాలని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు మలేరియా సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని జీలుగుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి బర్రింకలపాడులో శుక్రవారం నిర్వహించిన మొదటి విడత దోమల మందు పిచికారీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఏజెన్సీ గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా విధిగా దోమల మందు పిచికారీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పిహెచ్‌సి వైద్యాధికారి బి.గాయత్రి మాట్లాడుతూ గ్రామస్తులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.. ఇళ్లల్లోని కుండిల్లో నీటి నిల్వలు లేకుండా, పాత టైర్లు, కొబ్బరి చిప్పలు వంటివి ఇళ్లల్లో లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి పెద్దిరాజు, పంచాయతీ కార్యదర్శులు సిహెచ్.వీరలక్ష్మి, అశోక్, హెల్త్ అసిస్టెంట్ ప్రసాద్, రవీంద్ర, బాలాజీ, ఎఎన్ఎం ఆదిలక్ష్మి, ఆశాలు రాధ, జగదాంబ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

భార్య కాపురానికి రావడంలేదని..

ప్రజాశక్తి - పోలవరం

భార్యాభర్తల మధ్య తలెత్తిన విభేదాల నేపథ్యంలో పుట్టింటికి వెళ్లిపోయిన భార్య కాపురానికి రావడంలేదని మనస్తాపానికి గురైన భర్త ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలవరం ఎఎస్ఐ కె.నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పట్టిసీమ పంచాయతీ వీరభద్రపురానికి చెందిన మసకపల్లి నాగభూషణం(21)కు, అతని భార్యకు మధ్య విబేధాలు తలెత్తాయి. దీంతో అతని భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపానికి గురైన నాగభూషణం గురువారం రాత్రి తన ఇంట్లో చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రొయ్యల లోడు కంటైనర్ బోల్తా

ప్రజాశక్తి - ప్రజాశక్తి

జాతీయ రహదారి కురెళ్లగూడెం వద్ద రొయ్యల లోడు కంటైనర్ బోల్తా పడింది. మండలంలోని కురెళ్లగూడెంలో శుక్రవారం రొయ్యల లోడు చేసుకొని కంటైనర్ తాడేపల్లిగూడెం వైపు వెళ్లేందుకు బయలుదేరింది. కురెళ్లగూడెం యూ టర్న్ తీసుకుంటుండగా 12 చక్రాల లారీపై ఉన్న కంటైనర్ ఊడిపోయి రోడ్డుమీదకు ఒరిగి కింద పడిపోయింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదని హైవే పెట్రోలింగ్ పోలీసులు వెల్లడించారు.

నాటుసారా స్థావరంపై దాడి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని కామయ్యపాలెం గ్రామ శివారులో గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న నాటుసారా తయారీ స్థావరంపై జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ అధికారి కె.శ్రీనుబాబు ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం దాడులు చేశారు. ఈ దాడుల్లో ఐదు లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని సారా తయారీకి సిద్ధంగా ఉన్న 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. కేసుకు సంబంధించి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఒత్తిడి లేని నాణ్యమైన విద్య 'శ్రీశారద' సొంతం

విద్యాసంస్థల చైర్మన్ కె.శంకరరావు, కరస్పాండెంట్ కె.రాధిక

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఒత్తిడి నాణ్యమైన విద్య శ్రీశారద విద్యాసంస్థల సొంతమని చైర్మన్ కె.శంకరరావు, కరస్పాండెంట్ కె.రాధిక అన్నారు. ఈ సందర్భంగా వారు ప్రజాశక్తితో మాట్లాడారు. 176 మంది విద్యార్థులు, పదిమంది అధ్యాపకులతో 2006లో శ్రీ శారద విద్యాసంస్థలో ఇంటర్ ఎంపిసి, బైపిసి, సిఇసి, ఎంఇసి కోర్సులు ప్రారంభించి నేడు డిగ్రీ కళాశాల స్థాయికి ఎదిగిందన్నారు. నూతన ఒరవడిలోని విద్యా విధానంతో హైస్కూల్ విద్యను సైతం అందిస్తూ అన్ని తరగతుల ప్రజల ఆదారాభిమానాలు పొందగలుగుతుందన్నారు. 2005లో ధర్మ అప్పారావు కళాశాలలో ఉద్యోగ విరమణ పొందిన అధ్యాపకులు ఎం.బలరామకృష్ణమూర్తి, అవధాని, ఎంఎస్ఎన్.రమణ, డి.మధు, అమర లింగేశ్వరరావు వంటి హేమాహేమీలు 27 మంది విద్యార్థులతో ఇంటర్మీడియట్ కళాశాలను కొనసాగించినట్లు చెప్పారు. తనపై ఉన్న నమ్మకంతో ఆ అధ్యాపక బృందం కళాశాలను తనకు అప్పగించగా 2006 నుంచి తాను, తమ అధ్యాపక సిబ్బంది అవిశ్రాంత కృషి చేసి శ్రీ శారద విద్యాసంస్థలకు మంచి గుర్తింపు తెచ్చినట్లు చైర్మన్ శంకరరావు చెప్పారు. 2010లో డిగ్రీ కళాశాలను మీర్జాపురం ఎస్టేట్‌లో ప్రారంభించామన్నారు. ఆనాడు బిఎస్‌సి, ఎంపిసి, కంప్యూటర్ సైన్స్, సిబి జెడ్, బీకాం కంప్యూటర్స్, జనరల్ కోర్సులను కొనసాగించినట్లు చెప్పారు. వంద మందితో ప్రారంభమైన డిగ్రీ కళాశాల నేడు 350 మంది విద్యార్థులు, 15 మంది అధ్యాపకులతో కొనసాగుతున్నట్లు చెప్పారు. జిల్లాలో రూరల్ ప్రాంతంలో కొనసాగుతున్న అతి పెద్ద కళాశాలల్లో మూడోదిగా శ్రీ శారద విద్యాసంస్థలు నిలవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ ఏడాది దేదీప్య సాయి ఇంటర్ బైపిసిలో 991 మార్కులు సాధించి స్టేట్ ర్యాంక్ కైవసం చేసుకున్నట్లు తెలిపారు. జూనియర్ ఇంటర్‌లో విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారన్నారు.



చైర్మన్ శంకరరావు



కరస్పాండెంట్ రాధిక



ఈ విద్యాసంవత్సరం నుంచి అందుబాటులోకి రానున్న శ్రీశారద విద్యాసంస్థల భవనం

ఒత్తిడి లేని చదువు, ప్రతి విద్యార్థి పట్ల వ్యక్తిగత శ్రద్ధ, కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి, విశాలమైన ఆవరణం, ప్రకృతి మధ్య ఆహ్లాదకరంగా విద్యా బోధన, డిజిటల్ క్లాస్ రూమ్స్, కల్చరల్ ఆక్టివిటీస్, ఐఐటి, నీట్, యుపిఎస్‌సి ఫౌండేషన్ క్లాసెస్, హైజాన్ వాస్‌రూమ్స్, ఆర్ఒ డ్రింకింగ్ వాటర్, విశాలమైన క్రీడా ప్రాంగణం, క్రీడల్లో తర్ఫీదునిచ్చేందుకు నైపుణ్యత అనుభవం కలిగిన అధ్యాపకులు, అతిథి అధ్యాపకులతో ప్రతి వారం ఓరియంటేషన్ క్లాసులు నిర్వహించటం ప్రత్యేకతగా చెప్పారు. ఈ ప్రత్యేకతలు ప్రతి క్యాంపస్‌లో అమలు చేయనున్నట్లు విద్యాసంస్థల చైర్మన్ కె.శంకరరావు వివరించారు. గతేడాది 300 మంది విద్యార్థులతో శ్రీ శారద ఇంగ్లీష్ మీడియం విద్యాసంస్థను ప్రారంభించినట్లు చెప్పారు. ఈ విద్యా సంవత్సరం నుంచి పదో తరగతి హైస్కూల్ సెక్షన్ కొనసాగిస్తూ 500 మంది విద్యార్థులకు 20 మంది ఉపాధ్యాయులు విద్యను అందిస్తున్నట్లు చెప్పారు.

విద్య కోసం విజయవాడ నగరం వెళ్లే పరిస్థితులు పోయాయని... విజయవాడ, గుంటూరు వంటి జంట నగరాల నుంచి నూజివీడు తమ విద్యాసంస్థకు విద్యార్థులను తల్లిదండ్రులు పంపుతున్నారంటే అంత కన్నా గర్వకారణం మరొకటి లేదన్నారు. తమ విద్యాసంస్థలలోని విద్యార్థులు ఏటా పేరుగాంచిన వంద ఇంజినీరింగ్ కళాశాలల్లో మంచి సీట్లు సాధిస్తున్నట్లు తెలిపారు. 2023లో జోద్పూర్ ఐఐటి, 2018లో గౌహతి ఐఐటి, 2023 తాడేపల్లిగూడెం ఎన్ఐటి, 2023 అగ్రికల్చరల్ బిఎస్‌సిలో 15 మంది బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో, ఒకరు హోమియోపతి విభాగంలో సీట్లు సాధించినట్లు చెప్పారు. ఇప్పటికి 15 మంది తమ విద్యార్థులు చార్టెడ్ అకౌంటెంట్‌లుగా స్థిరపడినట్లు తెలిపారు. యూనివర్సిటీ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచినట్లు చెప్పారు. పేద విద్యార్థులను సైతం తాము ఉచితంగా చదివిస్తున్నట్లు తెలిపారు. లక్ష్యాల సాధన కోసం తమ విద్యాసంస్థలో ప్రతిఒక్కరూ అకుంఠిత దీక్షతో పని చేస్తున్నామన్నారు. అద్భుతాలను సృష్టిస్తూ, అరుదైన రికార్డులు నెలకొల్పుతూ, తల్లిదండ్రుల ప్రేమాభిమానాలు అందుకుంటూ, లక్ష్యాలను చేరుకుంటున్నట్లు శంకరరావు తెలిపారు.

గిరిజన సాగు భూములను ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో పెట్టొద్దు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

గిరిజన సాగులో ఉన్న భూములను ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో పెట్టాలని చూస్తే ఊరుకునే ప్రసక్తే లేదని సిపిఎం బుట్టాయగూడెం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ హెచ్చరించారు. మండలంలోని అంకన్నగూడెం పంచాయతీ జగన్నాథపురంలో శుక్రవారం పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ అంకన్నగూడెం పంచాయతీలో గిరిజన సాగులో ఉండి ఎల్‌టిఆర్ వివాదం ఉన్న సుమారు 30 ఎకరాల భూమిని కూటమి నాయకులు తప్పుడు రికార్డ్ సృష్టించి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో పెట్టాలని చూస్తున్నారని, అటువంటి ప్రయత్నాలు మానుకోవాలని నాయకులను హెచ్చరించారు. గిరిజనుల సాగులో ఉన్న భూములను సర్వే చేసి గిరిజనులకు పట్టాలివ్వాలని రెవెన్యూ అధికారులను కోరారు. పార్టీ జీలుగుమిల్లి మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు మాట్లాడుతూ కొన్నేళ్లుగా గిరిజనులకు, గిరిజనేతరులకు వివాదం నడుస్తున్న ఎల్‌టిఆర్ కేసులున్న భూములను ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో అమ్ముకోవడం దారుణమన్నారు. పీసా కమిటీ తీర్మానం ప్రకారం పోడు భూములకు పట్టాలివ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు సిరిబత్తుల సీతారామయ్య, తొడం గంగులు, గుండె గంగరాజు, కారం బోడెమ్మ పాల్గొన్నారు.

భారత జవానులకు సెల్యూట్

రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లో ఉగ్రవాద శిబిరాలపై భారత త్రివిధ దళాలు నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ సాహసోపేత చర్యగా నిలిచిందని రాష్ట్ర గృహ నిర్మాణ సమాచార పౌర సంబధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన మాట్లాడారు. భారత జవానులు చేసిన పోరాటం చరిత్రలో సువర్ణ అధ్యాయంగా నిలిచిందని, సెల్యూట్ చేస్తున్నానని చెప్పారు. భారతదేశం ఉగ్రవాదంపై ఎంత కఠినంగా వ్యవహరిస్తుందో మరోసారి స్పష్టం చేశాయన్నారు. భారత సైనికుల ధైర్య సాహసాలు యువతకు దేశభక్తిని మరింత పెంచాయన్నారు. ఆయనతో పాటు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, అర్బన్ హౌసింగ్ ఎస్ఇ ఎం.కృష్ణయ్య, హౌసింగ్ పీడీ జి.సత్యనారాయణ, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, జిల్లా, మండల వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో ర్యాలీ

ముదినేపల్లి : పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఉగ్ర మూకాలను శిక్షించడానికి భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా, అదేవిధంగా ఆపరేషన్ సింధూర్ కొనసాగుతుందని తెలిపిన సందర్భంగా భారత సైన్యానికి మద్దతుగా శుక్రవారం ముదినేపల్లిలో ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ నుంచి గురజ రోడ్డు వరకు జాతీయ జెండాలతో ఎన్‌డిఎ మండల నాయకుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో టిడిపి నియోజకవర్గ కన్వీనర్ వి.నరసింహారావు, కొడాలి వినోద్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలలో మాక్ డ్రిల్

ప్రజాశక్తి - పోలవరం

ఎల్లప్పుడు వైద్య సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నామని పోలవరం ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాంబాబు దొర అన్నారు. ఆసుపత్రిలోని వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బందితో శుక్రవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు దొర మాట్లాడుతూ వైద్య పరీక్షల యంత్రాలు సక్రమంగా పనిచేస్తున్నాయ లేదా పరిశీలించినట్లు తెలిపారు. వైద్య సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగానే ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గుణశేఖర్, డాక్టర్ విష్ణువర్థిని, డాక్టర్ కృష్ణంరాజు, డాక్టర్ సునీల్, డాక్టర్ భార్గవ్, హెడ్ నర్స్ ఉమ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మహారాణా ప్రతాప్ జయంతి వేడుక

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని కృష్ణాపురం గ్రామంలో రాజపుత్ర వీరుడు మహారాణా ప్రతాప్ 486వ జయంతిని బంజారా భజరంగీ బేరీ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బంజారా భజరంగీ భేరీ నాయకులు భూక్యా వేణుగోపాల్ మాట్లాడుతూ మొఘలాయి సామ్రాజ్యాన్ని ఎదిరించి పరాయి పాలనలో బానిసలుగా ఉండకుండా స్వతంత్రంగా జీవించాలని జీవితకాలం అంతా పోరాటం చేసిన మొట్టమొదటి భారత స్వతంత్ర యోధుడు మహా రాణా ప్రతాప్ అని అన్నారు. రాణా ప్రతాప్ జయంతిని ప్రభుత్వం ఆత్మగౌరవ పోరాటదినంగా జరపాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో భూక్యా రామకృష్ణనాయక్, భూక్యా రాములు నాయక్, భూక్యా భిగనాధం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఎడ్యుకేషన్ వర్క్‌షాపు విజయవంతం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటి ఆంధ్రప్రదేశ్, వాధ్వానీ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన ఐదు రోజుల ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ ఎడ్యుకేషన్‌పై వర్క్‌షాపు శుక్రవారంతో విజయవంతంగా ముగిసింది. ఈ వర్క్‌షాపులో ఆర్‌జియుకెటికి చెందిన పలు క్యాంపస్‌ల అధ్యాపకులు పాల్గొని విద్యార్థుల్లో స్టార్టప్ మైండ సెట్‌ను పెంపొందించేలా పూర్తిస్థాయి శిక్షణ పొందారు. ఇఐటిపి డీన్ పి.శ్యామ్ మాట్లాడుతూ వాధ్వానీ ఫౌండేషన్ ఈ కోర్సును 2025-26 విద్యా సంవత్సరంలో ఆర్‌జియుకెటి క్యాంపస్‌లలో ప్రామాణికత పొందిన అధ్యాపకుల సహకారంతో అందించనుందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో వ్యవస్థాపకతపై అవగాహన పెరిగి, భవిష్యత్తులో నూతన ఆవిష్కరణలతో ముందడుగు వేయగల మేధావులుగా ఎదగగల అవకాశాలు ఏర్పడనున్నాయని అమరేంద్రకుమార్ తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు ఇంకా నిర్వహించి విద్యార్థుల్లో భావితరాలకు మార్గదర్శకులుగా మారే అవకాశం కల్పించాలని ఆర్‌జియుకెటి నూజివీడు క్యాంపస్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మణరావు తెలిపారు.

గర్భిణులు వైద్య పరీక్షలు చేయించుకోవాలి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రతి గర్భిణీ నెలకోసారి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. పవర్‌పేట ఆరోగ్య కేంద్రాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గర్భిణులతో మాట్లాడుతూ ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ కార్యక్రమం ప్రతి ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ప్రతి నెలా 9, 10 తేదీల్లో జరుగుతుందన్నారు. ప్రతి గర్భిణీ మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. వీలైనంతవరకు ప్రభుత్వాసుపత్రుల్లో కాన్పు చేయించుకోవాలన్నారు. సుమారు 20 మంది గర్భిణులకు వైద్యాధికారి డాక్టర్ గౌతమ్ వైద్య పరీక్షలు నిర్వహించి తగు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం డ్రై డే కార్యక్రమంలో భాగంగా మేదర వీధిలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఝాన్సీ, మలేరియా హెల్త్ అసిస్టెంట్ మేకా శ్రీనివాసరావు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలి

12వ పిఆర్‌సి అమలు చేయాలి

కలెక్టరేట్ వద్ద ఎపిటిఎఫ్ ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలని, 12వ పిఆర్‌సి అమలు చేయాలని, మూడు పెండింగ్ డిఎలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి రామారావు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న తొమ్మిది రకాల పాఠశాలల వ్యవస్థ అసంబద్ధంగా ఉందని, ఈ వ్యవస్థను అమలు చేస్తే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వ్యవస్థ మొత్తం నిర్వీర్యం అవుతుందని చెప్పారు. తద్వారా ఉన్నత పాఠశాలల్లో కూడా విద్యార్థుల సంఖ్య తగ్గుతుందని, ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని ప్రాథమిక పాఠశాలలను ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు కొనసాగించాలని, ప్రాథమికోన్నత పాఠశాలలను ఒకటి నుంచి ఏడు వరకు లేదా ఒకటి నుంచి ఎనిమిది తరగతుల వరకు కొనసాగించాలని, ఉన్నత పాఠశాలలను ఆరు నుంచి పది లేదా ఆరు నుంచి 12 తరగతుల వరకు కొనసాగించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రెడ్డిదొర మాట్లాడుతూ జాతీయ విద్యావిధానం, విద్యాహక్కు చట్ట ప్రకారం అన్ని పాఠశాలల్లో మాతృభాష మాధ్యమంలో విద్యాబోధన జరగాలని, ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులను కొనసాగించాలని, ఉన్నతీకరించబడిన ఉన్నత పాఠశాలలకు ప్రధానోపాధ్యాయుల పోస్టులను, పీడీ పోస్టులను మంజూరు చేయాలని, ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తిని ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా తగ్గించాలని కోరారు. జిల్లా కార్యదర్శి యువి.నరసింహారాజు మాట్లాడుతూ ఇప్పటికే ఆలస్యమైనందున 12వ పిఆర్‌సి కమిషన్‌ను వెంటనే నియమించాలని, ఈలోపు ఐఆర్‌ని ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డిఎలను మంజూరు చేయాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షులు డికెఎస్ఎస్.ప్రకాష్‌రావు, ఎస్.రమాదేవి, జిల్లా ఆడిట్ కమిటీ బాధ్యులు జగదీష్, ఏలూరు నగర అధ్యక్షుడు కె.ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఎపిటిఎఫ్ నేతలు

రైతుల సంక్షేమానికి, ఆర్థికాభివృద్ధికి కృషి

దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని

ప్రజాశక్తి - దెందులూరు

దెందులూరు నియోజకవర్గంలోని డెల్టా ప్రాంతంలో ఆయిల్ పామ్ సాగును మరింత పెంచేలా, రైతుల ఆర్థిక అభివృద్ధికి, సంక్షేమానికి అండగా నిలిచే కార్యక్రమంలో భాగంగా రైతులకు ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో విస్తృత స్థాయి అవగాహనా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఉదయం దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్‌ను పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు మర్యాదపూర్వకంగా కలిసి, పలు ఆహ్వాన పత్రికలను పుష్పగుచ్ఛాలను అందించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించిన చింతమనేని సత్వరమే వాటిని పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ దెందులూరు నియోజకవర్గంలోని డెల్టా ప్రాంతాలైన పెదవేగి, దెందులూరు మండలాల్లోని నాయుడుగూడెం సహా పలు గ్రామాల్లో ఆయిల్ పామ్ సాగుకు ఎంతో అనుకూలమైన అవకాశాలు ఉన్నాయన్నారు. నియోజక వర్గంలోని కొబ్బరి, నిమ్మ, ఆయిల్ పామ్ సహా ఉద్యానవన శాఖ పరిధిలోని రైతులకు పలు అంశాలపై గ్రామస్థాయిలో, మండల స్థాయిలో విస్తృత స్థాయి అవగాహన కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఉద్యానవన శాఖ అధికారులకు సూచించారు.

తేనెటీగల పెంపకంపై రైతలకు శిక్షణ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని కామయ్యకుంట, రాజానగరం, చీమలవారిగూడెం, పులిరామన్నగూడెం గ్రామాల రైతులకు కామయకుంట గ్రామంలో తేనెటీగల పెంపకంపై శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆచార్య ఎన్‌జిరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో అఖిల భారత సమన్వయ తేనెటీగలు, పరాగ సంపర్కం జరిపే కీటకాల పరిశోధన పథకం ద్వారా వ్యవసాయ పరిశోధన స్థానం విజయరాయి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మార్టేరు పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు శ్రీనివాసరావు, రమేష్, పివి.రమణరావు, మోహన్‌రావు హాజరయ్యారు. శాస్త్రవేత్త మోహన్‌రావు తేనెటీగల పెంపకం, వాటి నిర్వహణ గురించి రైతులకు వివరించారు. కోటరామచంద్రపురం ఐటిడిఎ వ్యవసాయ సహాయ సంచాలకులు పిజి.బుజ్జిబాబు మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా రైతుల పొలాల్లో మట్టి నమూనాల సేకరణ జరుగుతుందని, రైతులు ఈ కార్యక్రమానికి సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి డి.ముత్యాలరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రైతు సోదరులు మొట్టం రమణ, మొత్తం గంగరాజు, కురసం పోషిరావు పాల్గొన్నారు.

ఉపాధి హామీని వ్యవసాయానికి అనుసంధానం చేయాలి

వేలేరుపాడు : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ చట్టాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసి కూలి ధరలను పెంచాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో శుక్రవారం మండల కౌన్సిల్ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడారు. ముందుగా పాకిస్తాన్ యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్‌కు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. పెదవాగు ప్రాజెక్టుకు తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలు సమన్వయంతో వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండి మునీర్, జిల్లా కార్యవర్గ సభ్యులు సన్నేపల్లి సాయిబాబు, రామవరం సర్పంచి పిట్టా ప్రసాద్, మండల కార్యదర్శి బాడిశ రాము, కౌన్సిల్ సభ్యులు పిట్టా వీరయ్య, బంధం అర్జున్, మడివి కామయ్య, షేక్ గౌస్, ప్రసాద్, చిన్నమ్మి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని పి.నారాయణ పురంలో నల్గొండ వెంకటేశ్వరావుకు చెందిన తాటాకిల్లు ఇటీవల ప్రమాదవశాత్తు దగ్ధమైంది. బాధిత కుటుంబాన్ని రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది శుక్రవారం పరామర్శించారు. అనంతరం వారి కనీస అవసరాలకు బియ్యం, నిత్యావసర సరుకులతో పాటు రూ.పది వేల నగదు స్థానిక ఎంపిటిసి నాలి శ్రీను చేతులమీదుగా అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి బుద్దా జగ్గారావు, విఆర్ఒ అశోక్, పంచాయతీ కార్యదర్శి పద్మజ, సచివాలయ సిబ్బంది శ్వేత నాయకులు వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీటి సరఫరాకు చర్యలు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

అకాల వర్షాల కారణంగా మండలంలోని ప్రజలు వ్యాధుల బారిన పడకుండా స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపిడిఒ బి.ఆనంద్‌బాబు చెప్పారు. మండలం లోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఉన్న సురక్షిత మంచినీటి సరఫరా వాటర్ ట్యాంక్‌లను గత రెండు రోజులుగా పారిశుధ్య సిబ్బందితో శుభ్రం చేయించి, క్లోరినేషన్ చేయించినట్లు తెలిపారు.

టిడిపి గ్రామ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - ముసునూరు

టిడిపి వలసపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మెదరమెట్ల సురేంద్రను ఏకగ్రీవ ఆమోదం తీర్మానించినట్లు టిడిపి పరిశీలకులు నక్కనబోయిన వేణు అన్నారు. టిడిపి వలసపల్లి గ్రామ అధ్యక్షులు, పార్టీ పదవుల ఎంపిక నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా సుదాగని నాగవరప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా నెరుసు సత్యనారాయణ, కార్య నిర్వాహక కార్యదర్శులుగా కుమ్మకూరి జోజి, సోదిమెళ్ల సాయిచందు, నత్తా శేఖర్, కొండపల్లి శివాజీ, పి.నాగబాబు, పల్లపోతు బసవ రాజకుమార్, కోశాధికారిగా గొల్లపల్లి రమేష్ ఎన్నికయ్యారు. ఆగిరిపల్లి మండలంలోని బొద్దనపల్లి గ్రామ సర్పంచి నక్కనబోయిన వేణు, ఈదర సర్పంచి డొండపాటి ఏసుపాదం ఆధ్వర్యంలో నిర్వహించారు.